

గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అర్హులందరికీ గృహలక్ష్మి కింద పక్కా ఇండ్లు

పిట్లం, అక్టోబర్ 2: అర్హత ఉన్న ప్రతి కుటుంబం ఇల్లు కట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద రూ. 3లక్షల ఆర్థికసాయం చేస్తున్నదని బీఆర్ఎస్ మండల నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నారం వెంకట్‌రాంరెడ్డి అన్నారు. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన 29 కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలను సోమవారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదలకోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషిచేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మరో సారి అధికారంలోకి తెచ్చుకుంటే తెలంగాణ మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాశీరాం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రమేశ్, నాయకులు, వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శి సమద్ తదితరులు పాల్గొన్నారు.

## లాల్ బహదూర్ శాస్త్రి జయంతి



లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

పిట్లం, అక్టోబర్ 2: మండలకేంద్రంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘ అధ్యక్షుడు గంగ ప్రవీణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైశ్యసంఘం మండల అధ్యక్షుడు బొడ్ల రాజు, మహిళా కమిటీ అధ్యక్షురాలు ఉడుగుల ప్రేమల, యూత్ కమిటీ అధ్యక్షుడు గుర్జాల రాము, స్వాతంత్ర్య సమరయోధుడి కుమారుడు ఉప్పు కిష్టయ్యగుప్తా, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

రామారెడ్డి, అక్టోబర్ 2: మండలకేంద్రానికి చెందిన బట్టు రాజశేఖర్ (26) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజశేఖర్ నిత్యం మద్యం తాగుతూ జులాయిగా తిరిగేవాడు. ఆదివారం రాత్రి మద్యం కోసం తల్లిని డబ్బులు అడుగగా, పొద్దున ఇస్తానన్నది. దీంతో కోపంగా వెళ్లిపోయి గ్రామ శివారులోని పటేల్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి బట్టు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## నేడు ఎల్లారెడ్డి మండల సర్వసభ్య సమావేశం

ఎల్లారెడ్డి, అక్టోబర్ 2: ఎల్లారెడ్డి మండల సర్వసభ్య సమావేశాన్ని నేడు (మంగళవారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు సకాలంలో హాజరుకావాలని కోరారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

# అభివృద్ధి చేసేవారిని ఆదరించండి

- ప్రతిపక్ష పార్టీ నాయకుల మాయమాటలు నమ్మొద్దు
- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- పెద్దకొడప్‌గల్‌లో సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన



సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే

పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 2: అభివృద్ధి పనులు చేసేవారిని ఆదరించాలని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. మండల కేంద్రంలో రూ.3.50 కోట్ల నిధులతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షిండే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని ఆరు మండల కేంద్రాలకు సెంట్రల్ లైటింగ్ మంజూరైనట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం చిన్న గ్రామాలు, తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి పంచాయతీ భవనాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. 60 ఏండ్లలో జరగని అభివృద్ధి ..బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో చేసి చూపించిందన్నారు. ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీ నాయకులు మాయమాటలు చెబుతుంటారని, వాటిని నమ్మవద్దని సూచించారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ తిర్మల్‌రెడ్డి, విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఖండేరావు, ఉపసర్పంచ్ విఠల్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలు



అమర్లబండలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

సదాశివనగర్/ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 2: సదాశివనగర్ మండలం అమర్లబండలో సోమవారం ఉపాధిహామీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీల సంఖ్య, పని దినాలు, అవసరమైన పనులను గుర్తించారు. పూర్తిచేసిన పనుల వివరాలను ఆడిట్ అధికారులు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తూరి లతా రాజేశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ రఘునాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలం కొక్కొండ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీకి సంబంధించిన లావాదేవీలను ప్రజలకు చదివి వినిపించారు. గ్రామంలో అవసరమున్న పనులను చేపట్టేందుకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రకాశ్, జీపీ కార్యదర్శి సవిత, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు

## బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభం

రామారెడ్డి, అక్టోబర్ 2 : మండల కేంద్రంలో 9వ వార్డులో బోరుబావి తవ్వకం పనులను సర్పంచ్ సంజీవ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికుల తాగునీటి సమస్యను ఎమ్మెల్యే జాజాల సురేందర్ దృష్టికి తీసుకెళ్లి, ఆయన సహకారంతో బోరుబావిని తవ్విస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగు రవీందర్‌గౌడ్, ఉప సర్పంచ్ ప్రసాద్, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ రాజేందర్, సొసైటీ డైరెక్టర్ లక్ష్మాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు జంగం లింగం, మహిపాల్, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా

పిట్లం, అక్టోబర్ 2: మండలకేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఆవరణలో ఏడీఏ రామకృష్ణ, ఏఈ బుజ్జిబాబు ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. మొక్కలు నాటి ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భీమేశ్వరాలయంలో పూజలు

తాడ్వాయి, అక్టోబర్ 4 : మండలంలోని సంతాయిపేట గ్రామస్తులు భీమేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల వాగు ఉధృతిలో కొట్టుకుపోయిన వందల సంఖ్యలో గేదెలు సురక్షితంగా బయటికి రావడంతో అభిషేకాలు నిర్వహించారు. భీమేశ్వరుడి కృపతోనే మూగజీవాలు బతికి బయటపడ్డాయని గ్రామస్తులు అన్నారు.

## నేడు ఎమ్మెల్యేల పర్యటన

### పిట్లం మండలంలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్న హన్మంత్ షిండే

పిట్లం/తాడ్వాయి, అక్టోబర్ 2 : జుక్కల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్ పలు గ్రామాల్లో నేడు (మంగళవారం) పర్యటించనున్నారు. పిట్లం మండలంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీపీ కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కంబాపూర్ నుంచి జంబిగి శివారు, మార్దండ నుంచి అంతర్‌గామ శివారు వరకు బీటీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. తిమ్మానగర్‌లో మన ఊరు-మనబడి కింద పూర్తిచేసిన పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. తిమ్మానగర్ వద్ద కాకివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. పిట్లం నుంచి కర్లేర్ శివారు వరకు బీటీ రోడ్డు, పిట్లం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు-మనబడి కింద నిర్మించిన భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. పిట్లంలో సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన, పిట్లం-బాన్సువాడ రహదారి మధ్య మిగిలిపోయిన పనులకు భూమిపూజ, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పోతిరెడ్డిపల్లి వరకు బీటీరోడ్డు, చిన్నకొడప్‌గల్ పాఠశాల భవనం, రాంపూర్‌లో జిల్లాపరిషత్ పాఠశాల భవనం, రాంపూర్ పాఠశాలలో అదనపు తరగతి గదులు ప్రారంభిస్తారని వివరించారు. గౌరారం నుంచి బండపల్లి వరకు బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### తాడ్వాయి మండలంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల..

తాడ్వాయి మండలంలోని పలు గ్రామాల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంగళవారం పర్యటించనున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కార్యదర్శి గోపాల్‌రావు తెలిపారు. బ్రాహ్మజివాడి దేవాయిపల్లి, బ్రాహ్మణపల్లి, సంగోజివాడి, చందాపూర్, తాడ్వాయి, చిట్యాల, సంతాయిపేట, సోమారం, ఎండ్రియాల్, నందివాడ, పల్లెగడ్డ తండా, ఎర్రాపహాడ్, దేమికలాన్, కన్‌కల్, కరడ్‌పల్లి గ్రామాల్లో రూ. 18 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం

జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు

పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 2 : గ్రామాల సమగ్రాభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. మండలంలోని పెద్ద దేవీసింగ్ తండా, మోసింగ్ తండా, వడ్లం, పెద్దకొడప్‌గల్, చిన్న తక్కడ్‌పల్లి, కాటేపల్లి గ్రామాల్లో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డితో కలిసి సోమవారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... పెద్ద దేవీసింగ్ తండా నుంచి బూర్గుపల్లి వరకు 2.5 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 2కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పోచారం తండా, విఠల్‌వాడి తండా, తడ్కల్ తండా, బోర్గి శివాపూర్ తదితర గ్రామాలకు బీటీరోడ్ల నిర్మాణానికి రూ. 6కోట్లు మంజూరైనట్లు వివరించారు. కండ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్యారంటీల పేరుతో మోసపూరిత హామీలను నమ్మొద్దని సూచించారు. ఎమ్మెల్యే షిండే చొరవతో పంచాయతీ భవనాలు, రోడ్లతోపాటు కాటేపల్లిలో కమ్యూనిటీ హాళ్లు మంజూరైనట్లు ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కాటేపల్లిలో 26 మందికి మంజూరైన గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిర్మల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్ద కొడప్‌గల్ జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ రాజు, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి